# వీధి వ్యాపారులతో పొదుపు సంఘాలు


పట్టణంలోని వీధి వ్యాపారులు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కసరత్తు చేస్తున్న మెప్మా అధికారులు

కైలాస్‌నగర్: పట్టణంలో చిరువ్యాపారాలు నిర్వహిస్తూ.. ఉపాధి పొందే వీధి వ్యాపారులకు ఆర్థికంగా చేయూతనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా సమయంలో రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు మూడు విడతల్లో ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ భారత్ (పీఎం స్వనిధి ) పథకం ద్వారా తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణాలరు అందించి ఆర్థికంగా అండగా నిలిచింది. ఇటీవల ఆ పథకాన్ని నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాల తరహాలో వీధి వ్యాపారులతో కూడిన పొదుపు సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అందుకనుగుణంగా చర్యలు చేపట్టిన మెప్మా సిబ్బంది సంఘాలను ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారు.

**ఆర్థిక పరిపుష్టిని కలిగించేలా..**

స్వయం సహాయక మహిళా సంఘాలు సమిష్టిగా పొదుపు చేయడంతో పాటు రుణాల సద్వినియోగంతో ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నాయి. వాటి మాదిరిగానే వీధి వ్యాపారులను సైతం ఆర్థిక చేయూతనందించేలా కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్(సీఐజీ) పేరిట సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో సంఘంలో ఐదు నుంచి పది మందితో ఈ గ్రూపును ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో సుమారు 4వేల మంది వీధి వ్యాపారులుండగా తొలి విడతగా 92 సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆదిశగా చర్యలు చేపట్టిన మెప్మా సిబ్బంది ఇప్పటి వరకు 32 సంఘాలను ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన సంఘాల్లోని సభ్యులకు పలు అంశాలపై శిక్షణనివ్వనున్నారు.

### సంఘాల ఏర్పాటు చేస్తున్నాం



పట్టణంలోని వ్యాపారులతో కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఆ దిశగా చర్యలు చేపట్టి సంఘాలను ఏర్పాటు చేయిస్తున్నాం. ఈ నెలాఖరులోగా లక్ష్యం మేర సంఘాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేస్తాం. సంఘాలుగా ఏర్పాటయ్యాక వ్యాపార మెళుకువలు, రుణం, పొదుపు, తిరిగి చెల్లింపు వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం. – కె.శ్రీనివాస్, మెప్మా డీఎంసీ

# ఘనంగా గురుపౌర్ణమి


సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు

నేరడిగొండ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శ్రీ సరస్వతీ దేవి, భారతమాతా చిత్రపటాలకు పూజలు చేశారు. పాఠశాల ప్రధానాచార్యులు మీన మాట్లాడుతూ గురుపౌర్ణమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రతిఒక్కరూ గురువుల పట్ల మర్యాద పూర్వకంగా మొదలాలని, వారు చూపిన అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల రాజేశ్వర్, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్, సొనాల మండలాల వ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేదం పాఠశాల, సొనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేదంలో విశ్రాంత ఉపాధ్యాయులు కుమ్మరి పోశెట్టి, వైద్య సురేశ్‌లను శాలువాతో సత్కరించారు. వివేకానంద పాఠశాలలో గురుపౌర్ణమి గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: గురుపౌర్ణమి వేడుకలు మండలంలోని ఖోడద్ గ్రామంలోని బాజీరావు బాబా ఆలయంలో, పల్సి(బి)తండాలో నారాయణ బాబా ఆయలంలో ఘనంగా నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాజీరావు బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, వెంకటేశ్, మొట్టె కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, తిరుమల్‌గౌడ్, అభిరాం రెడ్డి, ప్రకాష్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: తల్లిదండ్రులే మొదటి గురువులని, వారిని గౌరవించడమే హిందూ సంప్రదాయమని వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పట్వారిగూడ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులను గౌరవించి వారి మనోభావలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు.

గుడిహత్నూర్: మండలంలోని తోషం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నేరడిగొండ: గురుపౌర్ణిమ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం పొరదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. బంజారా కాశీ అయిన పొరదేవి శ్రీజగదంబ మాతా, జగత్‌గురు సేవాలాల్ మహరాజ్ సంత్ శ్రీ రామారావ్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శేఖర్ మహరాజ్, కబీర్‌దాస్ మహరాజ్, ధర్మ గురు బాబుసింగ్ మహరాజ్‌ల ఆశీస్సులు తీసుకున్నారు.

# పరిసరాల పరిశుభ్రత పాటించాలి


మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నేరడిగొండ: వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని దర్బ, దర్బ తండా గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆయా గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ మౌనిక, ఏఎన్‌ఎం సంగీత, ఆశ వర్కర్ సంధ్య పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్, లిమ్‌గూడ గ్రామాల్లో ఆదివాసీ బిరుదు గోండ్ కళా బృందం కళాకారులు కళాజాత ప్రదర్శన ద్వారా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గోండి, మరాఠి, కొలాం భాషలో పాటలు పాడుతూ.. నాటికలు ప్రదర్శిస్తూ.. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది నిర్మల, జలేందర్, గోకుల్, కళాకారులు పాల్గొన్నారు.

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని డాబా(కె) గ్రామంలో ఝరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్, హెచ్‌ఈవో నాందేవ్, సంజయ్, ఏఎన్‌ఎం సురేఖ, రత్నా, కల్పన, సులోచన, చంద్రకళ, హెచ్‌ఏ ప్రకాష్ పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

బజార్‌హత్నూర్: బ్యాంకు ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని విలేజ్ పోలీస్ ఆఫీసర్ రాథోడ్ మోహన్ సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైం, యాంటీ డ్రగ్స్, షీటీం, పోక్సో చట్టం, 100 డయల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమన్న, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### క్షయపై అవగాహన అవసరం

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు క్షయపై అవగాహన కలిగి ఉండాలని డీటీసీవో సుమలత అన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన 69 మంది రోగులకు ఎక్స్‌రేలు తీశారు. 10 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్షయ, క్యాన్సర్‌పై ప్రతి ఒ క్కరికీ అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు గుట్కా, ధుమపానాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కిరణ్, మధురిమ, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన

జైనథ్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం జిల్లా విద్యుత్‌శాఖ అధికారి చౌహాన్ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ముక్తాపూర్ 11కేవీ అదే విధంగా బెల్లూరి ఫీడర్ పరిధిలో అంతరాయం ఉందన్నారు. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు నరికి వేయాలన్నారు. గృహజ్యోతి పాత బకాయిలు వెంటనే వసూలు చేయాలని కోరారు. ఆయన వెంట అదిలాబాద్ డీఈ హరికృష్ణ, శ్రవణ్ కుమార్, జైనథ్ ఏఈ శ్రీనివాస్, ఎస్‌ఎల్‌ఐ సత్తయ్య, ఎల్‌ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

### యోగాతో మానసిక ప్రశాంతత

బోథ్: ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో రెండో విడతలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో యోగా శిక్షకురాలు మునిగెల యోగిత విద్యార్థులకు గురువారం యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఉదయం యోగాసనాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి వలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న పలువురి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని గురువారం అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. వారి నుంచి రూ.వెయ్యి నగదుతో పాటు సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 65,020 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్‌లు, పేకాట ముక్కాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడం జరిగిందన్నారు.

# 'మంత్రిని విమర్శించే స్థాయి లేదు'


మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

కైలాస్‌నగర్: మంత్రి సీతక్కను విమర్శించే స్థాయి, అర్హత మాజీ ఎంపీ మాలోతు కవిత, తుల ఉమకు లేదని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్ మెప్పు కోసమే ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని వాటిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో లారీలతో తొక్కించిన చరిత్ర బీఆర్‌ఎస్‌దీ కాదా అని ప్రశ్నించారు. జీవో 49 టైగర్ కారిడార్‌కు సంబంధించి ప్రభుత్వ స్థాయిలో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునీల్ జాదవ్, గిమ్మ సంతోష్, గుడిపల్లి నగేశ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, సంతోష్, శ్రీలేఖ, రఫీక్, అశోక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతి మహోన్నతమైంది


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: భారతీయ సంస్కృతి ఎంతో మహోన్నతమైందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం, ఆశారామ్ బాపూజీ ఆశ్రమంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులే ఆది గురువులని పూజించే సంస్కృతి కేవలం సనాతన ధర్మంలో మాత్రమే ఉందన్నారు. తల్లిదండ్రులను పూజించిన తర్వాత మాత్రమే గురువులను పూజించే గొప్ప ఆనవాయితీ భారతదేశానికి సొంతమన్నారు. హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు విజయ్, మోహన్ అగర్వాల్, జోగురవి, స్వామి, ధోని జ్యోతి పాల్గొన్నారు.

## ఇంద్రవెల్లిలో భారీ వర్షం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు భారీవర్షం కురవడంతో వాగులు పొంగిపొర్లాయి. మండలంలోని ముత్నూర్ త్రివేణి సంఘం చెరువు వరద నీటితో నిండిపోయింది. మండలంలోని మామిడిగూడ, జైత్రంతండా, జెండగూడ, చిత్తబట్ట గ్రామాల రాకపోకలకు స్తంభించి పోవడంతో రాకపోకలకు ఇబ్బందికి గురయ్యారు. సాయంత్రం వరదనీరు తగ్గిన తరువాత రాకపోకలు సాగించారు. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వరదనీరు చేరింది.

**వర్షానికి కూలిన ఇల్లు**

నార్నూర్: మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి గాదిగూడ మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన వేలాది భీంరావు ఇల్లు గురువారం కూలిపోయింది. దీంతో బాధితుడు నిరాశ్రయుడయ్యాడు. నిత్యవసర సరుకులు తడిసిపోయాయి. దాదాపు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

నార్నూర్: నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నార్నూర్ మండలంలోని భారీక్‌రావుగూడ, ధన్నుగూడ, గాదిగూడ మండలంలోని మరోతిగూడ, కూనికసా సమీపంలో గల వాగులు వరద నీటితో ఉప్పొంగాయి.

# రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలని బోథ్ మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి విన్నవించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. బోథ్ నుంచి తరలిపోయిన కార్యాలయాలను తిరిగి బోథ్‌కు రప్పించాలని కోరారు. బోథ్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో చంటి, బోథ్ డివిజన్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మెరుగు నర్సింహదాస్ పాల్గొన్నారు.

## గోరింటాకు సందడి


గోరింటాకు పెట్టుకున్న మహిళా ఉపాధ్యాయులు

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడ ఆశ్రమ పాఠశాలలో గురువారం గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు. మహిళ ఉపాధ్యాయులు గోరింటాకు పెట్టుకొని సందడిగా గడిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టకోవడం సంప్రదాయంగా వస్తుందన్నారు. మహిళలు గోరింటాకు పెట్టకోవడం శుభ సూచకమన్నారు. విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయండి


ఇళ్ల పనులను పరిశీలిస్తున్న అధికారి

జైనథ్: మండలంలోని ఆకుర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గురువారం మండల అభివృద్ధి అధికారి మహేశ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు ఎలా జరుగుతున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేసుకోవాలని సూచించారు. విడతల వారీగా నిధులు మంజూరు అవుతాయన్నారు.

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తోందని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. గురువారం సొనాల మండలంలోని సాకెర గ్రామంలో పర్యటించారు. పేదవారు ఆత్మగౌరవంతో బతికేలా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సొనాల మండలంలోనే అత్యధిక ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపులు జరిగాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రమేశ్, గాజుల పోతన్న, పీఏసీఎస్ డైరెక్టర్ లోలపు పోశెట్టి, జుంగాల భోజన్న, సుధీర్, గంగాధర్, అమృత్ రావ్, ఉస్మాన్, ముజ్జు, జమీర్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఎంపీడీవోకు సన్మానం**

నేరడిగొండ: మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శేఖర్‌ను మండల మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహుకరించారు. కార్యక్రమంలో నక్క మహేందర్, కుర్మే నారాయణ స్వామి, అనుపట్ల సంజీవ్, బోగి లక్ష్మణ్, ధావుల శ్రీనివాస్, ఆకుల అశోక్ పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలికి..**

ఇచ్చోడ: మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా ఎంపికైన పుల్లెటి శ్యామలను నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నాయకపోడ్ సంఘం మండల అధ్యక్షుడు పెరమండ్ల నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం నాయకపోడ్ కులానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. పెరమండ్ల పోశెట్టి, ఎర్రం భీముడు, పెరమండ్ల చరణ్, భీముడు పాల్గొన్నారు.

**ఆవుకు అంత్యక్రియలు**

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని మహాదేవుని మందిరానికి చెందిన ఆవును పిచ్చికుక్క కరవడంతో రేబిస్ వ్యాధితో ఆవు మృతి చెందింది. గురువారం గ్రామస్తులు ఆవుకు పూజలు చేసి అంత్యక్రియలు చేశారు.

**ఓటు హక్కును నమోదు చేసుకోవాలి**

భీంపూర్: మండలంలోని నిపాని గ్రామంలో బూత్ లెవల్ అధికారులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణాధికారులు మాట్లాడుతూ.. బీఎల్‌వోలు గ్రామస్థాయిలో పర్యటించి 18 సంవత్సరాల నిండిన యువతి, యువకులు ఓటుహక్కు నమోదు చేసుకునే విధానాన్ని వివరించాలన్నారు. శిక్షణాధికారులు మహేష్, సూరజ్, ప్రభాకర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

**నేడు కార్యకర్తల సమావేశం**

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రత్న గార్డెన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**పశువుల యజమానులపై ఫిర్యాదు**

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన షేక్ అన్వర్ బుధవారం రాత్రి జెడ్పీ కార్యాలయం ఎదుట పశువులను ఢీకొని గాయపడ్డాడు. రిమ్స్‌లో చికిత్స పొందిన ఆయన గురువారం టూటౌన్‌లో పశువుల యజమానులపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

**శతాధిక వృద్ధురాలు మృతి**

నేరడిగొండ: మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన శతకాధిక వృద్ధురాలు సాబ్లే గౌరియ బాయి (115) బుధవారం తన స్వగృహంలో మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. గ్రామస్తులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

**వర్షావాస్ ప్రారంభం**

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధ వీహార్‌లో గురువారం భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వర్షవాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న జాడే ప్రజ్ఞాకుమార్ హాజరై గౌతమ బుద్ధుడి విగ్రహానికి, సామ్రాట్ అశోక చక్రవర్తి, అంబేడ్కర్, రమాబాయి అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్, దయానంద్, కాంతారావ్ పాల్గొన్నారు.

**తల్లి కూతురు అదృశ్యం**

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన తల్లి కూతురు అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. 27ఏళ్ల సాజిదబేగం, తొమ్మిదేళ్ల కూతురు ఫాతిమా ఈనెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్తతో మనస్పర్ధలు ఏర్పడి పుట్టింట్లో ఉంటున్న ఆమె కూతురుతో కలిసి వెళ్లగా తిరిగి ఇంటికి రాలేదు. ఆమె సోదరుడు జావిద్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

## ఆయిల్‌పాం తోటలో కీటకాల విడుదల

తాంసి: ఆయిల్‌పాం సాగు చేసిన రైతులు అధిక దిగుబడి కోసం గురువారం హస్నాపూర్ శివారులో మొక్కలకు కీటకాలను విడుదల చేశారు. హస్నాపూర్ శివారులో ఉన్న పంటచేలలో రైతులతో సీనియర్ ప్లాంటేషన్ అధికారి రమేశ్ కీటకాలను విడుదల చేశారు. పరపరగా సంపర్కం కోసం ఎలడోబియస్, కామరునికస్ అనే కీటకాల ద్వారా అధిక దిగుబడి వస్తుందన్నారు. క్లస్టర్ ఆఫీసర్ శ్రీకర్, రైతులు స్వామి రెడ్డి, రాజు, దత్తు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

ఇంద్రవెల్లి: వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ కుటుంబరావ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఏఎంపీవో జీవన్‌రెడ్డి, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 'హామీలు నెరవేర్చాలి'


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తులం బంగారం ఇస్తామన్న హామీ ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఇదే కాకుండా ఎన్నో హామీలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవితారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, భీంరావ్‌నాయక్, జాదవ్ రమేశ్ పాల్గొన్నారు.

### రైతుల అభ్యున్నతికి కృషి

నేరడిగొండ: రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని బోథ్ బ్లాక్ ఆత్మ డైరెక్టర్లు కుంట శంకర్, సొంటి లక్ష్మిలు అన్నారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలోని ఇటీవల నియామకం కాగా వారిని రైతువేదికలో గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారి అభ్యున్నతికి పాటుపడతామని పేర్కొన్నారు.

భీంపూర్: మండలంలోని అర్లి(టీ)కి చెందిన కామన్ అశోక్ ఇటీవల అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మా) నూతన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆయనను గురువారం శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో ఖానాపూర్ మండల కేంద్రంలోని నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఇంద్రవెల్లి గ్రామపటేల్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మొత్తం 60 కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

### సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ఆదిలాబాద్: గురుపౌర్ణమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయం (మంగ మఠం)లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వేదపండితులు వ్రతకథను వివరించగా భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. సత్యదేవుడిని అష్టోత్తర నామాలతో పూజించి, ధూపదీప నైవేద్యాలతో నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వైభవ్ శర్మ మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన గురు పౌర్ణమి రోజున సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడం విశేషమైన, అనంత పుణ్య ఫలాలను అందజేస్తుందన్నారు. ఎండోమెంట్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

### సీఎస్‌సీ జిల్లా మేనేజర్‌కు అవార్డు

కైలాస్‌నగర్: కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) కేంద్రాల జిల్లా మేనేజర్ కామెరి రాహుల్ టాప్ డిస్ట్రిక్ మేనేజర్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రజలకు డిజిటల్ సేవలను అందించడంలో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపినందుకు ఆయనను ఎంపిక చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన 16వ సీఎస్‌సీ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఐటీ శాఖ చీఫ్ సెక్రటరీ భవేష్ మిశ్రా, మీ సేవ కేంద్రాల కమిషనర్ రవికిరణ్, ఎస్‌బీఐ డీజీఎం వినోద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

### రోడ్డు వేయాలని వినతి

బోథ్: సొనాల మండల కేంద్రంలో కబురస్థాన్ వరకు సీసీరోడ్డు నిర్మించాలని మైనార్టీ నాయకులు ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని తుల అరుణ్ కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బత్తుల రమేశ్, గాజుల పోతన్న, లోలపు పోశెట్టి, భోజన్న, సుధీర్, గంగాధర్, అమృత్ రావ్ పాల్గొన్నారు.

### ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి

తాంసి: ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. గురువారం తాంసి మండల కేంద్రంలో వనమహోత్సవంలో భాగంగా పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పచ్చదనం పెంపునకు ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగన్న, కారోబార్ సుభాష్, గ్రామస్తులు గంగారెడ్డి, నవకాంత్, నరేశ్, మహిళలు పాల్గొన్నారు.

సాక్షి
దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వదువ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899